



ప్రదిహేనురోజులు జ్వరంతో పోరాడి చివరకు నేనే విజయం సాధించి (అంటే పత్యం తీసుకొని) స్నేహితుల్ని తిరగవేయడానికి (ప్రస్తుతం మనం నిరుద్యోగులం గనుక కొన్త ఫ్రండ్స్‌తో కాలక్షేపం చేద్దామని) బయలుదేరాను మొట్టమొదట మా గణపతి దగ్గరకు వెళ్ళామనిపించింది కాళ్ళు కూడా వాళ్ళింటివేపే దారితీశాయి తీరా వాళ్ళింటికి బైట గేటుకు ఒక పౌను అట్ట "విఘ్ననాయక ఫిలింస్" అని నల్ల సిరాతో వ్రాయబడి వేళ్ళాడకట్టబడి ఉంది వాడితో కాలక్షేపం చేద్దామని వెళ్తే అట్ట బోర్డు ఎదురైంది. అంటే మనవాడు ఇల్లు మార్చాడన్నమాట ! సొంత ఇల్లు వదిలి (మావాడు) ఎక్కడికి వెళ్ళాడో ఈ 'విఘ్ననాయక ఫిలింస్' వారికి తెలుసేమోనన్న అనుమానం నాలో (కొన్త) చోటు చేసుకుంది. అనుమాన నివృత్తికై 'విఘ్ననాయక ఫిలింస్' వారిని అడుగుదామని గేటుతీసి లోపలి కెళ్ళాను. లోపలి కెళ్ళి చూద్దునుగదా మా గణపతి మేనల్లుడు, వసారాలో గది గుమ్మం దగ్గర స్టూలుమీద కూర్చొని నిద్రపోతున్నాడు. ఆ గది గుమ్మందగ్గర నాకు ఇంకో అట్ట బోర్డు ఎదురైంది. దానిపైన "పి. జి పతి మోషన్ పిక్చర్స్ ప్రొడ్యూసర్" అని పచ్చ సిరాతో వ్రాసి ఉంది. ఆరినీ ! •కథ అర్థమైంది. మావా డొక సినీ ప్రొడ్యూసరైపోయాడండోయ్ ! కొన్త సంతోషంగా గది కర్టెన్ తొంగించి లోనికి పోయాను.

లోపలి గణపతిగాడి వైభవం చూస్తే నాకు నవ్వాగలేదు (పైకి నవ్వలేదు) మావాడిని ఒక్క చేతుల్లేని కుర్చీ మోస్తోంది వాడిముందు నల్ల చెక్క టేబుల్ ఒకటి ఉంది దానికి ఒక కాలు సగం విరిగితే మావాడు అది నిలబడేందుకుగాను విరిగిన కాలుకింద రెండు ఇటుకరాళ్ళు పెట్టి నట్టున్నాడు. ఆ టేబుల్‌పైన వేసిన టేబుల్ క్లాత్ మటుకు శుభ్రంగా ఉంది దానిమీద రెండు ఫైల్సు (వాటిలో ఏమున్నాయో ఇంకా చూడ లేదు) ఒక పైలట్ పెన్, తుప్పుబట్టిన యాష్‌ట్రే (వాడు ఎస్. ఎస్. ఎల్ సి చదివే టప్పుడు వాళ్ళ నాయనమ్మకు తెలీకుండా కొన్నాట్ట) రెండు తాగేసిన కాఫీ గ్లాసులు, ఒక కాలింగ్‌బెల్ (పూర్వం హోటళ్లలో ఉండే బెల్ మాదిరిది) ఉన్నై. గదినిండా శత దినోత్సవాలు జరుపుకున్న చిత్రాలు తాలూకు వాల్ పోస్టర్లు అంటించబడి ఉన్నై !

• మావాడు టేబుల్‌కు కాళ్ళు తన్నిపెట్టి, కుర్చీ గోడకు చేరేసి, నిద్రపోతున్నాడు నేను టేబుల్ ముందున్న స్టూల్ జరిపేసరికి మావాడు• ఉలిక్కిపడి లేచాడు. వాడి కుదుపుకు టేబుల్‌మీదున్న రెండు గాజు గ్లాసుల్లో ఒకటి కిందకు దొర్లింది.

తత్ఫలితంగా పగిలింది కూడా ! నన్ను చూసి వాడు పలుకరించలేదు సరిగదా, 'టింగ్ టింగ్' మని కాలింగ్‌బెల్ నొక్కాడు. అది విని బైట నిద్ర పోతున్న వాళ్ళ బాబిగాడు "యస్ సార్" అంటూ లోపలికి పరుగెత్తుకొచ్చాడు.

"ఏరా బైట ఏం చేస్తున్నావ్ ? ఎవరన్నా వచ్చినప్పుడు నాకు ఇన్‌ఫాం చెయ్యకుండా లోనికి పంపవద్దని చెప్పలా ?" అని అన్నాడు మా గణపతి, వాళ్ళ బాబిగాడిని కోపంగా చూస్తూ !

బాబిగాడు ఏడుపుమొహం పెట్టి "చెప్పావు మామయ్యా, కాదు కాదు సార్" అన్నాడు.

"మరి ఈయన లోపలి కెలా వచ్చారు ?" వాడి ప్రశ్నకు బాబిగాడు బిక్కమొహంవేసి నుంచు న్నాడు.

"వెళ్ళు ఇటువంటి పొరపాటు మళ్ళీ చేస్తే వూరుకొనేది లేదు" అన్నాడు గణపతి ఆఫీసరు ఫోజులో !

ఈ సంభాషణ విన్న నాకు నవ్వాగలేదు (ఈసారి పైకి నవ్వేశాను) బాబిగాడు వెళ్ళగనే వాడు నన్ను "ఏమండీ ఏం కావాలి ?" అని అడి గాడు. ఈ ప్రశ్న నాకు మరింత ఆశ్చర్యాన్ని కలుగ జేసింది. నాలుగేళ్ల నుండి నాతో ఫ్రండ్‌షిప్ వెలగ బెడుతున్న వీడు, ఎప్పుడూ నాచేత ప్రేమలేఖలు వ్రాయించుకొనే వీడు, పరీక్షలో మా ఇంటికి వచ్చి చదువుకొనే వీడు, సోడా తాగితే డబ్బులు ఖర్చవుత వని హోటలుకెళ్ళి మంచినీళ్ళు తాగి వచ్చే వీడు, ఈ గణపతిగాడు, నన్ను "ఏమండీ ఏం కావలి" అని అడిగితే ఎలా ఉంటుందో మీరే చెప్పండి. కోపంతో "ఏరా పిరికలవూడికి (దండప్రయోగంచేత ఈ వూళ్ళో పిచ్చి కుదురుస్తారని ప్రతీతి) ప్రయాణం కడుతున్నావా ఏం" అని అడిగాను.

"మిష్టర్, ఏమిటా మాటలు ?" మావాడు పెద్దగా అరిచాడు.

"లేకపోతే ఏమిట్రా నీ కేమన్నా మతి పోయిందా ఏం ? నేనురా, నేనూ ఓంకార్ని" వాడికెలా చెప్పాలో తెలియక ఈవిధంగా తెలియచెప్పా.

దానికి వాడు,

"మిస్టర్ ఓంకారం ! నువ్వూ, నేనూ ఐయాప్ పీరే, మీరూ, నేనూ స్నేహితుల మన్నమాట నిజమే! కానీ ఎక్కడ ? బైట. ఈ గదిలో ఉన్నంతవరకు నేను ప్రొడ్యూసర్ సి. జి పతిని, నీవు కస్టమర్‌వి" అని అన్నాడు కరప్షన్ ఎరుగని ఉద్యోగిలా !

మావాడొట్టి జగమొండి. వాడు చెప్పినట్లు చెయ్యకపోతే వాడి ఒళ్ళే వాడికి తెలీదు. వాడి ప్రొడ్యూసరాయణం తెల్సుకోవాలంటే వాడిని కాకా పట్టాల్సిందే మరి !

"ఐతే ప్రొడ్యూసర్ సార్ మీకు ఎవరూ ప్యూన్ దొరకలేదా, చిన్నపిల్లవాణ్ణి గేటుదగ్గ రుంచారు" అని అడిగాను

"ఆఁ ఏమీలేదండి కుర్రవాడికి శలవులు. వూరికే గొడవచేస్తూ ఎండలో తిరుగుతుంటే ప్యూనును మాన్పించి వీడిని కూచోబెట్టాను భయంకొద్దీ వాడు ఎప్పుడు గేటు దగ్గరే కూచొని ఉంటాడు" అని చెప్పారు ప్రొడ్యూసరుగారు హాయిగా నవ్వుతూ.

కుర్రవాడికి వాడంటే భయంలేదని, రోజుకు పావలా ఇస్తానంటే గేటు దగ్గర నిద్రపోతున్నా డని తర్వాత ఆ కుర్రవాడి ద్వారానే తెలిసింది.

"మీ సినిమా ఏ ఫక్కీలో తియ్యాలనుకొంటు న్నారు ? నటీనటుల్ని టెక్నీషియన్స్‌ని సెలెక్ట్ చేశారా" అని అడిగాను ఇంటర్వ్యూ కెళ్ళిన పత్రికా విలేఖరిలా !

"మా సినిమా అంతా కొత్త ఫక్కీలో నడు స్తుందండీ. ఇంకా కథ ఎన్నుకోలేదు. నేను సినిమా రంగానికి (పుస్తకానికి కాదు) కొత్తవాడ్ని. అలాగే మా సినిమాలో నటీనటులు, రచయితలు సంగీత దర్శకులు తదితర సాంకేతిక నిపుణులందరు కొత్తవాళ్లే కన్పిస్తారు"

"మరి స్టూడియో కూడా కొత్తదే నాండి ?" నాకు అనుమానం వేసింది చెప్పొద్దూ ! వీడు సినిమా అంతా కొత్త పద్ధతిలో తీస్తానంటు న్నాడు. కొత్త పద్ధతిని చెప్పి సినిమా ఏకంగా ఇంట్లోనే తీసేస్తా డనిపించి అలా అడిగాను.

దానికి వారు పెద్దగా నవ్వేసి "లేదండి ! పాత స్టూడియోల్లోనే నిర్మిస్తాం" అన్నారు.

"ఐతే రచయితలు కూడా కొత్తవాళ్ళే నన్న మాట"—నా ప్రశ్న.

"అహ ! అంతా కొత్తవాళ్లే"

ఇక్కడ నా గురించి మీకు కాస్త చెప్పాలి నేను ప్రస్తుత ప్రొడ్యూసరు ఫోర్తుఫారం చదువు తున్నప్పటినుండి స్నేహితులం. అలానే ఇద్దరం కలసి బి. ఏ లోకి వచ్చాం. (దండయాత్రల వివ రాలు చెప్పటంలేదు, క్షమించండి) నేను కాలేజీలో అడుగుపెట్టిన దగ్గర్నుండి రచయితను కావాలని

రచన: ప్రభాకర్

ఉవ్విళ్ళూరుతుండేవాడిని నా ఆశ దినదిన ప్రవర్ధ మానమై చిన్నచిన్న కథలు రాయటం మొదలు పెట్టాను. ఈమధ్య పత్రికకు పంపిన మూడు కథల్లో రెండు తిరిగి వచ్చినై (మూడో కథకు స్టాంపులు జత చెయ్యలేదు.) ఇప్పుడు చిన్నచిన్న నవలలు రాయగల్గుతున్నాను. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే, ఆఁ! మీరు తెలుసుకున్నారు. తెలుసుకొని వూరుకోకుండా నవ్వుతున్నారు కూడా ! నవ్వకండి, చదవండి.

"అయితే ప్రొడ్యూసర్ సర్ ! నేను కూడా రచయితనన్న సంగతి మీకు తెలుసు. నా దగ్గర ఐదారు కథలున్నై. మీరు కావాలంటే ...." చేతులు నలుపుకుంటూ అడిగాను.

"తప్పకుండా నండి మీ దగ్గరున్న రచనలు ఇంకా ఎక్కడ పబ్లిష్ కాలేదుకదా."

"లేదండి"

"మీ నవల ఏదో పత్రికలో ధారావాహికంగా వెలువడుతోందని విన్నాను. ఏ పత్రికలో ప్రచు రిస్తున్నారు ?" ప్రొడ్యూసరు డ్రాయరు సొరుగు బర్రుమని లాగుతూ అడిగాడు.

"మన వూరినుండి వెలువడుతున్న లిఖిత మాసపత్రికలో ప్రచురితమౌతోంది"

"అయితే ఆ కథలు తీసుకురండి వాటిలో ఒకటి సెలెక్ట్ చేద్దాం. ఏదీ నచ్చకపోతే కొత్త కథ రాద్దురుగానీ" అని అన్నారు సిగరెట్‌పెట్టె బైటకు తీసి సొరుగులోనికి నెట్టూ !

"అలాగే నండి"

"ఐతే కవిగారూ మీ పూర్తిపేరు చెప్పండి" అని అన్నాడు వాడికి నా పేరు తెలీనట్లు.

అయినా వాడి రోజులు గదా అని "ఓం ప్రకాశ్" అని చెప్పాను.

"మీ పేరేమీ బాగాలేదండీ ! చూడండి, పెద్ద పెద్ద కవులు గూడా కలం పేర్లు పెట్టుకుంటు న్నారు. అలాంటప్పుడు మీ పేరును కూడా కొద్దిగా మార్పుచేస్తే ఏం ? ఓం ఓంకారమంటే మరీ మోటుగా ఉంది. ఏమంటారు ?"

"చిత్తం."

"మీరు ఓం ఓం అని పెట్టుకోండి ఇంచక్కా శ్రీ శ్రీ లా."

అలా మార్పు చేసేందుకు ఇష్టమే నన్నట్లు తల ఆడించాను. ఈ ప్రొడ్యూసరుతో మాట్లాడు తుంటే నా మనస్సులో బేకారీగా తిరుగుతున్న వెంకట్రావు వురఫ్ నాటకాలరావు, దీక్షితులు అన బడే హరికథల హార్మోనిస్టు వాడి బృందము, మెది లారు నిరుద్యోగంతో బాధపడుతున్న వీళ్లకు సహాయం చెయ్యగలనన్న వూహా నాలో మెది లింది.

"ఇదుగో కవిగారూ, మీ కథ ఎలా ఉండాలో తెలుసా" నా ఆలోచనలకు అంతరాయం కలి గిస్తూ మా ప్రొడ్యూసరుగారు అడిగారు.

"తెలీదండి"

"మన సినిమా అంటే మీరు రచిస్తున్న కథ ఇంటర్వెల్ దాకా విషాదంగా లేదా కామెడీగా ఇంటర్వెల్ నుండి కామెడీగా లేదా విషాదంగా ఉండాలి. ఏమంటారు ?"

"ఏమంటాను మన సినిమాను ప్రేక్షకులు ఇంటర్వెల్ వరకే చూస్తారు" అని మనసులో అనుకొని ప్రొడ్యూసర్‌గారితో "అలా చేస్తే బాగానే ఉంటుందని" చెప్పాను. కత్తి యుద్ధాల నుండి హెలికాప్టర్ యుద్ధాల వరకు మా సిని మాలో ప్రదర్శించాలట. అన్నట్టు అందులో పద్యాలు గూడా ప్రవేశపెట్టాలట. వాడి, సారీ, వారి మాటల్నిబట్టి చూస్తే వారు తీసే చిత్రము అనగా వారికి కావలసిన నా కథ చారిత్రాత్మకమో జానపదమో, సాంఘికమో అర్థంకాలేదు. ఎందు కంటే వారి సినిమాలో ఈ నాలుగు పద్ధతులు కన్పించాలట. సినిమా ఇట్లా తీసేట్టయితే ఆప రేటరు కూడా దాని మొహం చూడడని చెప్పాను. దానికి ప్రొడ్యూసరుగారు ఖస్సుమని లేచారు. ఆయన చిత్రం కొత్త రికార్డు సృష్టిస్తుందిట! "అమాటకొస్తే నువ్వు కథ రాయొద్దుఫో !" అన్నారు ప్రొడ్యూసరుగారు ఈమాటనేసరికి నేను నిలువునా నీరైపోయాను మళ్ళీ అరగంట కాకా పడ్తే నార్మల్‌కొచ్చారు, మా ప్రొడ్యూసరుగారు !

"ప్రొడ్యూసర్ సర్ ! మీకు వెంకట్రావు, దీక్షితులు తెలుసా ? . . వాళ్లేనండి ఒకడు నాట కాలు వేస్తాడు, మరొకడు హార్మనీ—...."

"తెలుసండోయ్ కవిగారూ తెలుసు ఏమిటి సంగతి ?"—నవ్వుతూ అడిగారు ప్రొడ్యూసరు గారు.

"ఆ ఏమీలేదు మన సినిమాలో వాళ్ళ కేవైనా ఖాళీలు చూపిద్దామని. దీక్షితులకు మ్యూజిక్ డైరెక్షను, వెంకట్రావుకు హీరో వేషం ఇస్తే బాగుంటుంది" అని అన్నాను కాకా ఫలిస్తుంది గదా అన్న సంతోషంతో !

## మా కథ

దానికి వారు "లేదండి, వెంకట్రావుకు హీరో వేషం ఇవ్వటానికి వీలులేదు నేను ఈ చిత్రానికి ప్రొడ్యూసర్, డైరెక్టర్ అండ్ హీరోగా వర్క్ చేస్తాను దీక్షితులుగారికి మీరు చెప్పినట్లు మ్యూజిక్ డైరెక్షన్ ఇద్దాం, వెంకట్రావుని మాత్రం సైడ్ హీరోగా బుక్ చేద్దాం" అని అన్నారు.

ఐతే వీడు సినిమా డైరెక్టు చేస్తాడన్నమాట అయ్యయ్యో! ఇంతకన్నా ఘోరం ఇంకేమన్నా ఉందా! వీడు సినిమా డైరెక్టు చేస్తానంటే కాలేజీలో చదివే రోజుల్లో వీడు డైరెక్ట్ చేసిన నాటకం గుర్తుకొచ్చింది ప్రసిద్ధ సినీ రచయిత విరచితమైన ఒక నాటకాన్ని కాలేజి యూనివర్సిటీకి ప్రదర్శించాలని మాగణపతి (ప్రస్తుత ప్రొడ్యూసరు) బృందం (నేనుతప్ప) నిశ్చయించింది ఆ నాటకాన్ని ఈగణపతి డైరెక్ట్ చేశాడు (మా డ్రమెటిక్ అసోసియేషన్ ప్రెసిడెంటుగారి సైకిలు నాలుగుసార్లు శుభ్రంగా తుడిచి, ఆ నాటకంలోని పాత్రధారులకయ్యే మేకప్ ఖర్చులు తానే భరించి, వాళ్లందరికి నాలుగుసార్లు టీ పార్టీలిచ్చి, డైరెక్టర్‌గా సెన్సార్ చెయ్యించుకున్నాడని ప్రతీతి) ఆనాటకంలో కొత్తదనం చూపిస్తానని వీడు ఒక లేడీ స్టూడెంట్‌చేత హీరోవేషం వేయించాడు. ఆమెకు (సారీ! హీరోకు) స్టేజిపైకి రాగానే కాళ్ళు వణక సాగాయి. ఎలాగైతేనేం డైలాగులు వప్పచెప్పటం మొదలుపెట్టింది, ఆడహీరో! సూటూబూటూవేసుకున్న ఆమె అలవాటు ప్రకారం పైట సరిచేసుకోబోయింది. ఇక చూడండి ప్రేక్షకుల రియాక్షన్! వాళ్ళు పాత్రధారులపైన చెప్పు మొత్తంగా వేయకుండా ఒక్కోచెప్పును నాలుగు భాగాలుగా చేసి మరీవేశారు. దానితో ఆరు రంగాలు గల ఆ నాటకంలోని ఐదున్నర రంగాల ప్రదర్శన సశేషంగానే వుండిపోయింది

"ఏమిటండీ ఆలోచిస్తున్నారు" — అన్నాడు ప్రొడ్యూసరుగారు గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్ వెలిగిస్తూ!

"ఏమీ లేదండి, మరినేవస్తాను వీలుంటే మీరు సాయంత్రం అలా పార్కుకురండి నేను కూడా వస్తాను. కాస్త కులాసాగా గడపొచ్చు" అని అన్నాను పార్కులో అయితే స్నేహితుడుగా వాడు సినిమా తీయటానికి ఎలాపూనుకున్నాడో తెలుసుకోవచ్చనే వుద్దేశ్యంతో!

"అలాగేనండి నాకూ కాస్తరిలీఫ్‌గా వుంటుంది. తప్పకుండా వస్తాను"

ప్రొడ్యూసరు గారి దగ్గర శలవు తీసికొని ఇంటికి బయలుదేరాను.

* * *

అనుకున్న ప్రకారం అయిదు గంటలకల్లా పార్కుకు చేరుకునేసరికి మావాడేదో పుస్తకం చదువుతూ గడ్డి మీద దొర్లుతున్నాడు నేను మెల్లిగా వెళ్లి వాడిప్రక్కనే కూర్చున్నాను. నన్ను చూసివాడు గబగబా పరుగెత్తుకెళ్ళి ఒకపావలా వేరుశనగకాయలు కొనుక్కొచ్చి నాముందు పోశాడు. అరె! ప్రొడ్యూసరు ఇవన్నీ ఎలా చేస్తున్నాడనుకోకండి. వాడు నాచిన్ననాటి స్నేహితుడు (కుచేలుడంతటివాడు, కాని వీడికి డబ్బుంది!) కుశల ప్రశ్నలైన తరువాత ఒక్కొక్క కాయ వలుచుకు తింటూ మావాడి ప్రొడ్యూసరాయణం గురించి అడిగాను.

వాడు వేరు శనగకాయలు తినటం ఆపేసి, గొంతు సవరించుకొని, చొక్కా దుమ్ము దులుపుకొని, ఇటూ అటూ చూసి, మధ్యలో ప్రశ్నలు వేయవద్దని చెప్పి, ఇలా చెప్పటం మొదలు పెట్టాడు.

"నాకు నాయనమ్మ తప్ప మరెవ్వరూ గార్డియన్లు లేరని నీకు తెలుసు ఆ నాయనమ్మ నన్నొక గ్రాడ్యుయేటును చేయటానికి మార్చి సెప్టెంబర్లకు విసుగులేకుండా యూనివర్శిటీకి గ్రాంట్లు ఇచ్చిందని కూడా నీకు తెలుసు ఆ నాయనమ్మ నేను పి. యు సి. లో చేరినప్పటినుండి యాత్రలకు పోతాననటం నీకు విదితమే! ఆమె యాత్రల ఆశయం ఇన్నాళ్లకు నెరవేరింది. నేనిక జన్మలో బి. ఎ. పాస్‌కానని, ఆమెనాకళ్ల ఎదుట వుంటే ఇక బాగుపడననీ, ఆస్తంతా నాపేర వ్రాసి వీలునామా ప్లీడరు దగ్గర వుంచాననీ, అవసరమైతే తీసుకోమని చెప్పి యాత్రలకు వెళ్లింది. (ఆమెకు త్రివేణి సంగంలో ఐక్యం అయిపోవాలని వుందిట!) ఆమె వెళ్ళిన రెండురోజులకు మా అక్కయ్య వచ్చి భోరుమంది ఎందుకంటే, నాయనమ్మ ఆమెకు చెప్పకుండా వెళ్ళిందని! బావకూడా కాంపులకెళ్ళాడట తను ఒక నెలరోజులుండి పోతానంది. మా పొలాలు, గృహాలు వగైరా స్థిరాస్తులు ఎక్కడెక్కడ వున్నాయో మా అక్కయ్య తెలియచెప్పేదాకా తెలియలేదు వివరాలన్నీ విన్న తర్వాత ఆ ఆస్తితో రెండు సినిమాలు తీయవచ్చని నిర్ణయించుకున్నాను. అందుకే మొదటి సినిమాను ప్రెసిడెంషియల్ అవార్డు కొరకు కొత్త పంథాలో నిర్మించదలచుకొన్నాను. నీవు మాత్రం కథ ఎంత త్వరగా అందిస్తే అంత మంచిది. ఆ వీలునామా కొరకు ప్లీడరు దగ్గరకు వెళ్తే ఆయన వూళ్లోలేడని ఒకవారం వరకు రాడని తెలిసింది. కొంతపొలం అమ్మితేగాని డబ్బు చేతిలోపడదు. అన్నట్లు మన కంపెనీ రిజిస్టర్ చేయించాలి,



అయ్యా! నాకు హిందీ బాగా వచ్చు' చాలా మీటింగులలో చాలా మంది ఉపన్యాసాలు అనువాదం చేశాను! కానీ, మీరు మాట్లాడే హిందీ ఏ ప్రాంతానిదో .... యేమో! ఒక్క ముక్క కూడా అర్థం గావటం లేదు!!

మన ఆఫీసు ఫర్నిచరు మార్చాలి, నీకూ కొంత అడ్వాన్సు ఇవ్వాలి. ఈవారం ఆగి ప్లీడరు దగ్గర ఆ పత్రాలు తీసికొని కొంత పొలం అమ్మితేనేగాని ఈ పనులన్నీ చేయటానికి వీలుండదు."

కథ చెప్పటం పూర్తిచేసి నేను మిగిల్చిన వేరు శనగకాయలు సొమ్ముచేయటం మొదలెట్టాడు, మావాడు.

ఈకథ విన్న తర్వాత వాడునిజంగా సినిమా తీస్తున్నాడని ధృడపరచుకున్నాను. నన్ను సినీ రచయితను చేస్తున్న నాఅదృష్టాన్ని స్వగతంతోనే అభినందించాను. తర్వాత అవీ ఇవీ మాట్లాడి ఇద్దరం (స్వ) గృహోన్ముఖులమయ్యాం!

ఇంటికి చేరిన నేను భోజనం కూడా చేయకుండా బుద్ధిగా కథరాయటానికి వుపక్రమించాను. పేపరు మీద కలం పాలరాతిమీద పాదరసంలా సాగిపోతోంది. గణపతి ఇచ్చిన హింట్స్ ప్రకారం కథలో అన్నిరకాల యుద్ధాలు, విచిత్ర సంఘటనలు ఇముడుస్తున్నాను. నా మనస్సంతా కథపైనే కేంద్రీకరించిరాస్తున్నాను. (ఉత్తమ రచయితగా బహుమతి రావాలి మరి!) అర్ధరాత్రి అయేసరికి సగంకథ మాత్రమే పూర్తి అయింది. మిగతా కథ మరుసటి రోజు పూర్తి చేయవచ్చనే వుద్దేశ్యంతో పక్క మీదకు చేరాను.

రాత్రి పన్నెండు గంటల వరకు పనిచేయటంతో వుదయం ఎనిమిది గంటలకు అమ్మవచ్చి లేపిందాకా నిద్ర లేవలేక పోయాను. కాలకృత్యాలు ముగించుకొని మరల కథరాయటానికి కూర్చున్నాను. అలా రెండుమూడు లైన్లు రాసానో లేదో మా గణపతి రొప్పుతూ, రొజుతూవచ్చాడు. మొహమంతా చెమట పట్టివుంది వాడి వాలకం చూస్తే నానోటంట మాట రాలేదు. మౌనంగానే ఒక మరచెంబుడు నీళ్ళు తెచ్చివాడికిచ్చాను. అవి ఒక్క గుటకలో పూర్తి చేసి కుర్చీలో కూలబడ్డాడు. రెండుమూడు సార్లు నిట్టూర్చి వాడే నన్ను పలుకరించాడు.

"ఏమి ట్రా రాస్తున్నావ్?"

"మనసినిమాకు కథరా"— ఉత్సాహంగా జవాబు చెప్పాను.

"వద్దురా, రాయొద్దు! నేను సినిమా తీయటంలేదు" బిక్కమొహం వేసి అన్నాడు.

ఈమాట వినేసరికి నానెత్తిమీద పిడుగు పడ్డట్లైంది. వీడి సినిమా కొరకని అర్ధరాత్రిదాగా కూచోని సగం కథ పూర్తి చేస్తే ఇప్పుడొచ్చి వద్దంటున్నాడు. పెద్ద సినిమా తీసే వాడిలా నిన్నంతా పార్కులో కబుర్లుచెప్పి ఇవ్వాళ ఇట్లా చేస్తే నాకుకోపంరాదూ! ఆ కోపంతోనే నాపెన్లో వున్న ఇంకంతా (వాడి కథకొరకు పార్కర్ ఇంక్ కొన్నాను) వాడి మొహాన చల్లాను చిత్తుకాగితాలన్నీ చించి వాడి నెత్తినపోశాను వాడ్ని నోరారా తిట్టాను ఆశ్చర్యం! ఇన్ని చేసినా వాడు నోరు మెదపకుండా కూచున్నాడు. ప్రేమించి, పెళ్లిచేసుకుంటానని చెప్పి చివరకు పెళ్లిచేసుకుంటానికి తన అసమర్ధతను వ్యక్తపరిచే హీరో, హీరోయిన్ ఎన్ని తిట్టినా కొట్టినా ఎలా మెదలకుండా వూరుకుంటాడో అలానే కదలకుండా కూచున్నాడు మా గణపతి! తిట్టీ, తిట్టీ నాకే విసుగుపుట్టి నేను మౌనంగానే కూచున్నాను. కాసేపాగి నేనేదో అడగబోయేసరికి వాడే అన్నాడు— "నా కథంతా వింటే నువ్విలా చేయవురా"

"ఒరేయ్! సినిమా డైలాగులు నాదగ్గర వాడక! నిన్న ఒక కథచెప్పి నమ్మించావ్ మళ్లీ ఇవాళొక .."

"నిన్న చెప్పింది నిజం ఇవాళ చెప్పేది అక్షరాల నిజంరా!"

"ఏమిట్రా నిజం? నన్ను ఫూల్‌ని చెయ్యటమా?'

"మోసం జరిగిందిరా బ్రదర్ మోసం"

"ఏమిట్రా మోసం?" కాస్త తగ్గుస్థాయిలోనే అడిగాను.

"అలాచిన్నగా అడగరా చెప్తాను. యాత్రలకని వెళ్లిన మానాయనమ్మ తిరిగి వచ్చేసిందిరా!"

"ఎప్పుడు?"— ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తూ నా ప్రశ్న.

"ఇవాళ వుదయం ఆరుగంటలకు"— గద్గద స్వరంతోగూడిన వాడి జవాబు.

"వెళ్లి పదిహేనురోజులుకాలేదు. అప్పుడే యాత్రలన్నీ అయిపోయాయా?"

"అసలు మానాయనమ్మ యాత్రలకు పోతేగా"

"మరి"

"నేను నాయనమ్మ చాటు బిడ్డనని, ఆమె లేకపోతే ఇల్లు ఎలా చక్కబెట్టకలుగుతానో చూడాలని అనుకొందిట. అందుకని యాత్రలకని, మళ్లీరానని నాతోచెప్పి, మా అక్కయ్య గారింటికి చెక్కేసింది. అక్కడనుండి నాపరిస్థితి గమనించమని మాఅక్కయ్యను పంపింది ఆమె మన సినిమా హడావుడీ చూసి నాయనమ్మకు లెటరు వ్రాసేసరికి ఆమె తిరుగు టపాలో వచ్చేసింది! ఇక చచ్చేదాకా ఆస్తి నాపేర వ్రాయదట!"

"అదేమిట్రా వీలునామా ప్లీడరు దగ్గరుందన్నావుగా!"

ఇదొక నాటకంరా! ఆ రాస్కెల్ వూళ్లో వుండి కూడా ఇన్నాళ్ళు లేడనిపిస్తున్నాడు ఈసినిమాలాటి నాటకంలో వాడో గెస్ట్ ఆర్టిస్ట్ అయ్యాడు"

"ఐతే ఇప్పుడు మీనాయనమ్మ ఏమంటోంది?"

"వైధవ్యేషాలేయక మార్చికి కట్టమంటోంది. నాకుమాత్రం పరీక్షకు కూచోవాలనిలేదు. ఆ మాటే ధైర్యంచేసి ఆమెతో చేస్తే చీపురు తీసికొని కొట్టడానికి వచ్చింది. మానాయనమ్మ సంగతి నీకు తెలుసుగా, చేతికందితే నిజంగానే కొట్టగలదు. అందుకే గాభరాగా ఇటు పరుగెత్తుకొచ్చాను"— గణపతి నావేపు నిస్సహాయంగా చూస్తూ అన్నాడు. వాడిని చూస్తే నాకు జాలి వేసింది. నా ఆగ్రహప్రవర్తన తాలుకు సిరా గుర్తులు వాడిమొహం నిండా కనబడుతున్నై! మొహంకడుక్కోమని సబ్బు, నీళ్ళు తెప్పించి ఇచ్చాను. మొహం శుభ్రంగా కడుక్కొని, కాఫీ ఇచ్చినా తాగకుండా నాకు క్షమాపణ చెప్పుకొని వెళ్లిపోయాడు వాడి డిజప్పాయింట్‌మెంట్‌కు నాకు చాలా జాలివేసింది. వాడికి మనస్సులోనే సానుభూతి తెలియబరచి నా ఆలోచనలను వాడి నుండి కథ పైకి మరల్చాను. మా వూరి నుండి వెలువడే లిఖిత మాసపత్రికకు ఇవ్వవచ్చనే వుద్దేశ్యంతో మిగతా కథను పూర్తి చేయటానికి వుపక్రమించాను, మా వాడికథను కాదుకాదు" "మా కథ"ను మీ ముందుంచు తున్నాను. ★


పుస్తకములు

5 పుస్తకముల సెట్టు రు. 3-50.

(1) కొక్కోకశాస్త్రం (2) సుహాగ్రాత్ (3) చుంబన పద్ధతులు, (4) 84 ఆసనములు, (5) రహస్యఫోటో ఆల్బం. ఒక్కొక్క పుస్తకం రు 2/-. పోస్టేజి, ప్యాకింగ్ అదనం. ఇంగ్లీషులో వ్రాయండి.

ARHANT BOOK DEPOT,
26, ALIGARH (U P.)


'ఆంధ్రసచిత్ర వారపత్రిక'లో ప్రచురణకు ఇండియన్ ఇంక్ తో వేసిన కార్టూనులు మాత్రమే పంపాలి. సాధారణంగా 4" × 2", 4" × 4" చిత్రాలు పత్రికలో పడుతూ ఉంటాయి. సం||


మీరు త్రాగే
ప్రతి
సిరిటోన్
కప్పు
బలంతో నిండి
ఉంటుంది




తయారుచేయువారు:
సౌత్ ఇండియా రిసర్చ్
ఇన్‌స్టిట్యూట్ ప్రైవేట్ లిమిటెడ్
విజయవాడ.7

POIAR 58 TE